క్లుప్తంగా

శాకాంబరీగా అమ్మవారి అలంకరణ



ఆత్మకూర్: ఆషాడ మాసం సందర్భంగా శ్రీవాసవీకన్యకా పరమేశ్వరిమాతను శాకాంబరీమాతగా కూరగాయలతో అంకరించారు. శుక్రవారం అమ్మవారికి సాముహిక కుంకుమార్చన, మంగళహారతి, పుష్పార్చన, అమ్మవారి పల్లకీ సేవ తదితర పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్, వనిత క్లబ్ నిర్వాహకులు బాలకృష్ణ, రామకృష్ణ, కిరణ్, నవీన్, పవన్, నీలేష్, ఉదయ్, పావని, అర్చన, గాయత్రి, శ్రీధర్, శివరాములు, యాదగిరి, అరవింద్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

పరిశుభ్రత ముఖ్యం



పాన్‌గల్: గ్రామాల్లోని కాలనీల్లో చెత్తను ఇష్టానుసారంగా పారవేయకుండా తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్లలో వేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంటలో మహిళలకు పారిశుద్ధ్యం, స్వచ్ఛ గ్రామాలు, కిచెన్‌గార్డెన్ ఏర్పాటు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు తోడ్పాటునందిస్తే స్వచ్ఛ గ్రామాలుగా మారుతాయన్నారు. సమావేశంలో సర్పంచ్ అనూష, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

అమరచింత: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆధునిక సమాజ నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఆసంఘం నాయకులు వినోద్, అఖిల్ తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజేష్, కార్తీక్, ప్రవీణ్, సందీప్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి

వనపర్తి: జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఎం నాయకులు ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు శుక్రవారం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో చాలా మంది పేదలు కిరాయి ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని వారు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పలు దఫాలుగా పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసినా.. స్థలం చూపించ లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎన్నిసార్లు ఈ విషయంపై స్పందించాలని వినతి పత్రాలు ఇచ్చినా.. అధికారులు అదే నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేలా బోధన

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనే సుఖ ప్రసవాలు

పాన్‌గల్: వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని డాక్టర్ రాకేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీ నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ అదనపు డాక్టర్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మదనాపురం: నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలని డాక్టర్ భవాని సూచించారు. శుక్రవారం మడల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై ఏఎన్ఎంలకు, ఆరోగ్య సిబ్బందికి, పాఠశాల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు విముక్తి

గోపాల్‌పేట: మహారాష్ట్ర రాష్ట్రంలోని సోలాపూర్ సమీపంలో రోడ్డుపనులు చేస్తున్న 21 మంది కూలీలకు విముక్తి కలిగించామని నేషనల్ ఆదివాసి సాలిడరీ కౌన్సిల్ కోఆర్డినేటర్ వాసుదేవరావు అన్నారు. శుక్రవారం తమ ఎన్‌జీఓ కార్యకర్తలు కూలీలను సొంత గ్రామంలో వదిలిపెట్టినట్లు తెలిపారు. వారంతా మహారాష్ట్ర రాష్ట్రంలోని సోలాపూర్‌లో రోడ్డుపనులు చేస్తుండగా గుర్తించి విషయాన్ని అక్కడి ప్రభుత్వ సబ్ డివిజినల్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లగా వారు గురువారం ఉదయం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బాండెడ్ లేబర్ యాక్ట్ చట్టం కింద వారికి విముక్తి కలిగించారని తెలిపారు. గోపాల్‌పేటకు చెందిన కాంట్రాక్టర్ ప్రసాద్ తక్కువ డబ్బులు ఇచ్చి ఎక్కువ కాలం పాటు పనులు చేయించేందుకు మండలానికి చెందిన కూలీలను తీసుకువెళ్లారు. వారిని శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ సమీపంలో వదిలిపెట్టారు.

రాస్తారోకో.. ఆందోళన



రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు, ప్రజాసంఘాల నాయకులు

అమరచింత/ఆత్మకూరు: పామిరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీలో ఏకంగా 60 మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురవ్వడంతో సిబ్బంది నిర్లక్ష్యం ఉందని ఆరోపిస్తూ వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకోలు చేపట్టి ఆందోళనకు దిగారు. కలుషిత ఆహారం ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. కేజీబీవీ ఎస్‌ఓతోపాటు కారకులైన సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు రాఘవేందర్, వెంకటేష్, రాఘవ, కుతుబ్, శ్రీహరి, హన్మంతు, మోష, ప్రసాద్, రాజన్న, గంగాధర్‌గౌడ్, జుబేర్, హరీష్‌గౌడ్, విష్ణు, గణేష్, పరమేష్, శ్రీను, బుచ్చన్న, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

కారకులపై చర్యలు

భోజనం వికటించి విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనకు సంబంధించి కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన పరామర్శించి.. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ కోటేష్, మున్సిపల్ చైర్ పర్సన్లు గాయత్రి, మంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవియాదవ్, రమేష్ తదితరులున్నారు.



పాఠశాలలోని నీటి సంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

● అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవియాదవ్ తదితరులు సేవలు చేసి మానవత్వం చాటుకున్నారు. సమయానికి అంబులెన్స్‌లు లేకపోవడంతో తుఫాన్ వాహనాలను సమకూర్చి.. పరిస్థితి విషమంగా ఉన్న విద్యార్థినులను వనపర్తి ఆస్పత్రికి తరలించేలా చొరవ చూపారు.

● కస్తూర్బాగాంధీ విద్యాలయాలపై ప్రభుత్వం చిన్నచూపు తగదని బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు నరాల నారాయణ, అశోక్‌జీ, మేర్వరాజు, శ్యామభాస్కర్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు.

● కేజీబీవీ పాఠశాలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కె ప్రశాంత్‌కుమార్ రెడ్డి సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అక్కడే ఉన్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు వసతులు కల్పించాలని కోరుతూ ఆర్డీఓకు వినతిపత్రం అందించారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ గుంత మౌనిక

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టకు అనుబంధ గ్రామమైన పాతజంగమాయపల్లికి వెళ్లేందుకు బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. గ్రామస్తుల ఇబ్బందులను ఎంపీపీ గుంత మౌనిక దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రూ.12.32కోట్లు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. కొంతకాలంగా నడుస్తున్న నిర్మాణ పనులను ఎంపీపీ గుంతమౌనిక, సర్పంచ్ గాదం రాణి, మాజీ వైస్ఎంపీపీ పరిశీలించారు. పనులు త్వరగా, నాణ్యవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

భూమిపూజ

మండలంలోని పాతజంగమాయపల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సైడ్ డ్రైయినేజీ పనులకు ఎంపీపీ గుంత మౌనిక భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో డ్రైయినేజీ నిర్మాణం కోసం రూ.3లక్షలు, అదనపు గది నిర్మాణం కోసం రూ.4లక్షల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేట్టినట్లు ఎంపీపీ తెలిపారు.

చదువుకుంటే కాదు.. కొంటేనే ఉద్యోగాలు

వనపర్తి టౌన్: రాష్ట్రంలో చదువుకొని అర్హత కలిగిన వారికి ఉద్యోగాలు రావని, డబ్బులు సమర్పించి కొనుకున్న వారికే ఉద్యోగాలన్న చందంగా బీఆర్ఎస్ పాలన సాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ ఆరోపించారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారాన్ని ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా, మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో రామన్న గారి వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్ది రాజు, దేవేందర్, కుమార్, కురుమూర్తి, మధుసూదన్‌రెడ్డి, కర్ణాకర్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన



పెబ్బేరు: మండలంలోని పెంచికలపాడులో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ద్వారా శుక్రవారం సైబర్ నేరాలు, బ్యాంక్ లావాదేవీలపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరచితుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే బ్యాంక్ అకౌంట్ నంబర్, ఓటీపీని చెప్పకూడదని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బ్యాంక్ అకౌంట్, సురక్షితమైన లావాదేవీలు, బీమా, పింఛన్లు తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది శశికళ, శివ, సర్పంచ్ గోవిందునాయుడు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కూనంనేని అరెస్టు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును వరంగల్‌లో పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. పట్టణంలో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనంనేనితో పాటు అరెస్టు చేసిన నాయకులు తక్కల్లపల్లి శ్రీనివాస్‌రావు, వరంగల్ జిల్లా కార్యదర్శిని వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు దేశ సంపద దోచి పెడుతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసీ, విమానయానం, నౌకారంగం, బొగ్గు గనులు, విశాఖ ఉక్కుఫ్యాక్టరీ అన్నింటిని ప్రైవేటు పరం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రాబర్ట్, భాస్కర్, అబ్రహం, కుతుబ్, శ్యాంసుందర్, రవీందర్, మశప్ప, మల్లేష్ పాల్గొన్నారు.

వెంగళాయిపల్లిని పాన్‌గల్‌లోనే కొనసాగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంగళాయిపల్లి గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లిని నూతనంగా ఏర్పాటు చేసే కేతేపల్లి మండలంలో విలీనం చేయకుండా పాన్‌గల్ మండలంలోనే కొనసాగించాలని కోరుతూ సర్పంచ్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ చక్రపాణి, ఎంపీఓ రఘురాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసే మండలంలో తమ గ్రామాన్ని విలీనం చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పాత మండలంలోనే కొనసాగించాలని ఏకగ్రీవ తీర్మానం చేసి అధికారులకు అందించామని పేర్కొన్నారు. కేతేపల్లి మండలంలో విలీనం చేస్తామంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికులకు గాయాలు

పాన్‌గల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో పారిశుద్ధ్య కార్మికులు గాయపడిన ఘటన శుక్రవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం మండలంలోని కేతేపల్లికి చెందిన పారిశుద్ధ్య కార్మి కులు కుర్మయ్య, పకీరయ్య, మద్దిలేటి మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో పాల్గొని సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గ్రామ సమీపంలో కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయపడ్డారు. వారిని 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కార్మికులు గాయపడిన విషయం తెలుసుకొని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, గోపాలకృష్ణ, సీపీఎం నాయకులు దేవేందర్, భీమయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆది, కుర్మయ్య, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత

కొత్తకోట రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పదో తరగతి ఫలితాల్లో పామాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రికార్డు సాధించారు. 2022–23 విద్యా సంవత్సరానికి గానూ 23మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 70తానికి పైగా ఏ2 గ్రేడ్‌లో ఉత్తీర్ణులు కాగా మిగతా విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. సంవత్సరం పరీక్షల్లో ఆరుగురు ఫెయిల్ కాగా సప్లమెంటరీలో వారు కూడా పాసయ్యారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు



చిమనగుంటపల్లి తండాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి



పెబ్బేరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు, సంవత్సరానికి రైతుబంధు ఎకరానికి రూ.15వేలు అమలు చేస్తామని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వనపర్తి మండలంలోని వెంకటాపూర్, అంకూర్, చిమనగుంటపల్లి తండాలు, అచ్యుతాపురం, గ్రామాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అమరచింత: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డిని నియమించినట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ తెలిపారు. అదే విధంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అరుణ్ కుమార్ రెండోసారి నియమితుడయ్యారు.

కోర్టు తీర్పుపై నిరసన

పెబ్బేరు: మోదీ ఇంటి పేరు వ్యవహారంలో పరువు నష్టం కేసు ఎదుర్కొంటున్న రాహుల్‌గాంధీపై అనర్హత వేటును గుజరాత్ కోర్టు సింగిల్ బెంచ్ సమర్థించడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూడలేక కేంద్రం ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో యుగంధర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, గంధం సునీల్, రాములు, నరసింహ, చంద్రశేఖర్, రాములు, సాయిప్రసాద్, అంజి, రామకృష్ణ, సుధాకర్‌గౌడ్, రాజగౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రాహుల్‌గాంధీపై గుజరాత్ హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పును నిరసిస్తూ శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోవిందు, ఎంపీటీసీ ఎల్లస్వామి, శివనారాయణ, శ్రీధర్, రాజు, ఆశన్న, రమేష్, చందు, పురుషోత్తం, రాధాకృష్ణ, లోకేష్, రాజు పాల్గొన్నారు.

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారని నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ తెలిపారు. ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా జూరాల ఎంపీటీసీ సభ్యుడు పరమేష్, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నల్గొండ శ్రీనివాస్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందించారని తెలిపారు. అయ్యుబ్‌ఖాన్, తులసీరాజ్, రహ్మతుల్లా, గంగ నూతనంగా ఎన్నికైన పరమేష్, శ్రీనును అభినందించారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



శ్రీరంగాపురంలో సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పాన్‌గల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని పంచాయతీ కార్మికుల ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అరుణ్‌కుమార్, సీపీఎం మండల కార్యదర్శి దేవేందర్ అన్నారు. పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు శుక్రవారం కొనసాగింది. వారి సమ్మెకు జేఏసీ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై బెదిరింపులు తగవు

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్ల కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మెను కొందరు బెదిరింపులతో నిలిపివేయాలని చూస్తున్నారని, ఇలాంటి పద్ధతిని మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సీఐటీయూ మండల కన్వీనర్ రంజాన్ అలీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణాచారి, రంగస్వామి, రాముడు,నవీన్, వెంకటయ్య, కృష్ణారెడ్డి, రాజన్‌గౌడ్, నర్సింహ, ఈశ్వరమ్మ, గంగమ్మ, రాములమ్మ, సుంకులమ్మ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు.

బీఎస్పీ మద్దతు

పెబ్బేరు రూరల్: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని జిల్లా బీఎస్పీ కార్యదర్శి బహుజన రమేష్ డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశానుసారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు బీఎస్పీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లస్వామి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.



పెద్దమందడిలో..

కొత్తకోట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మె పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం రెండో రోజు కొనసాంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ ఐదేళ్ల కిందట 43రోజుల పాటు సమ్మె చేస్తే రూ.8,500 వేతనం సాధించుకున్నామని తెలిపారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వర్తింపజేయాలని, ప్రమాదంలో మరణిస్తే కార్మికుడికి రూ.10లక్షల నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.



వీపనగండ్లలో మాట్లాడుతున్న రంజాన్ అలీ

ఆత్మకూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు చేపడుతున్న దీక్షకు ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు, సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, జేఏసీ కన్వీనర్ ప్రసాద్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అశోక్, వెంకటన్న, నాగన్న, రమేష్, బాలకృష్ణ, రాజు, తేజ, దేవన్న, శ్రీను, చెన్నప్ప, కార్మికులున్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు రెండో రోజు సమ్మె నిర్వహించారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

పెబ్బేరు రూరల్: విద్యార్థులకు అందించే భోజన తయారీలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తహసీల్దార్ మురళి ఎస్ఓ వాణికి సూచించారు. శుక్రవారం ఆయన మధ్యాహ్న భోజన సమయంలో శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

వ్యక్తికి రిమాండ్

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లికి చెందిన మైబూసు పిల్లలు అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. శుక్రవారం మైబూస్ పాఠశాలకు వెళ్లి పాఠశాలలో చదువు చెప్పే టీచర్‌ను బూతులు తిడుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. టీచర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతడిని మహబూబ్‌నగర్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

సస్పెన్షన్ ఎత్తివేత

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి సర్పంచ్ పద్మను ఇటీవల కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సస్పెండ్ చేశారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించగా సస్పెన్షన్‌ను హైకోర్టు ఎత్తివేసిందని సర్పంచ్ పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జీలుగ సాగుతో భూమి సారవంతం

పాన్‌గల్: జీలుగ సాగు చేసి పూత దశలో భూమిలో కలియదున్నడంతో అది నేలకు సారవంతంగా పని చేస్తుందని ఏఈఓ నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్‌లో పంటల సాగుకు ముందు జీలుగను పొలంలో కలియ దున్నడంతో కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. జీలుగతో పొలానికి మూడు టన్నుల పచ్చిరొట్టి ఎరువు లభిస్తుందని, మొక్కలకు 2 శాతం నత్రజని, ఫాస్ఫేట్ అదనంగా అందిస్తుందన్నారు. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ దాతువులను పంటకు సమకూరుస్తుందన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

వనపర్తి: కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా భవన నిర్మాణ కార్మికులకు మోటార్‌సైకిళ్లు పంపిణీ చేయాలని భవన నిర్మాణం సంఘం జిల్లా అధ్యక్షులు మదన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో భవన నిర్మాణం కార్మికులు ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న లేబర్ ఇన్సూరెన్స్ వెంటనే విడుదల చేయాలని, 50 ఏళ్లు నిండిన కార్మికుడికి రూ.5వేల పెన్షన్ వెల్ఫేర్ బోర్డు నుంచి ఇవ్వాలని కోరారు. కూలీల అడ్డాల వద్ద తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. 2009 సంవత్సరంలో లేబర్ కార్డులు పొందిన వారికి రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటయ్య, నాయకులు పి.శ్రీను, మంద మన్నెం, అబ్దుల్లా, ఆశన్న, కురుమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌తో మొబైల్స్‌ను గుర్తించొచ్చు

కొత్తకోట రూరల్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి సొంతం చేసుకోవచ్చని పెద్దమందడి ఎస్ఐ హరిప్రసాద్ అన్నారు. అడ్డాకుల మండలం గుడిబండకు చెందిన చంద్రయ్య వారం రోజుల క్రితం కొత్తకోటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో పెద్దమండడి మండలం మోజర్ల స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్44 బుర్రవాగు వద్ద రూ.18వేల విలువ చేసే స్మార్ట్‌ఫోన్ కిందపడిపోయింది. కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఫోన్ చూసుకుంటే కనిపించకపోవడంతో బాధితుడు అదే రోజు పెద్దమండడి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ హరిప్రసాద్ సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయగా మిస్సయిన మొబైల్ ఎవరి దగ్గర ఉందో అతడిని గుర్తించి ఫోన్‌కు తీసుకొచ్చి చంద్రయ్యకు అప్పగించారు. ఫోన్‌ను అప్పగించిన ఎస్ఐ హరిప్రసాద్‌కు, కానిస్టేబుల్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.